# నిజరూపాలు

రచన:
శ్రీ. క్రోవి రామమోహన శాస్త్రి

(గత సంచిక తరువాయి)

రెండు గంటల్లో రమ పుట్టింటినుంచీ వచ్చేస్తోంది.

ప్రసాదరావు గుండె దడదడలాడింది. అర్ధరాత్రివేళ యీచిత్రం చేతుల్లో వుంచుకుని మేల్కొనివున్న తనను చూస్తే ఏమనుకుంటుంది? అందులోనూ యిది అన్ని చిత్రాలలాంటిది కాదు. నూరు నయాపైసల నగ్నచిత్రం. అసలే రమకు ఇలాంటి అర్టంటే పరమ అసహ్యం. రమే అనేమిటి! చాలామంది ఆడవాళ్ళే అంత. రమ పుట్టింటికి వెళ్ళిన ఈ పదిరోజుల్నుంచీ తనబాధ దేవుడికి తెలుసు. ఆమెవుంటే తన అవసరాలు 'అన్నీ' వెదుక్కోకుండా తీరిపోయేవి. ఆమె లేకపోవడంలో - చంద్రయ్య రమస్థానాన్ని ఆక్రమించుకోలేని నిర్భాగ్యుడుకావడంలో తనెంతో చీకాకు పడుతున్నాడు. దీనికి తోడు - ఆమె రాగానే ఈ చిత్రాన్నీ, తనవాలకాన్నీ చూసి మూతివిరిగించి, కోపగృహాలంకరణచేస్తే తనగతేంగాను? ఆమెను మార్చేశక్తి తన కెలానూలేదు. లేనప్పుడు - అగ్నిలో ఆజ్యం పోయడంకంటే సాధ్యమైనంతవరకూ తప్పించుకోవటం మంచిది. అంతేకాదు. శ్రేయోదాయకం కూడా!

అవును. శ్రేయోదాయకమే! అయితే ఎలా తప్పించుకోవటం? మార్గం? ప్రసాదరావు ఆలోచిస్తున్నాడు. నిముషాలు వెనక్కి అతివేగంగా నడిచిపోతున్నాయి. అతనిలో తొందర హెచ్చింది.

ఎలా?...ఎలా?...ఎలా?...ఎలా?...

ఈ చిన్నప్రశ్న ఎన్నిసార్లు మెదడులో చక్రంలా గిర - గిర పరిభ్రమించిందో అతను లెక్కపెట్టుకోలేకపోయాడు.

ఉన్నట్లుండి ప్రసాదరావు కళ్ళుమెరిశాయి. అతని ముందేదో దివ్యతేజస్సు వెలిగిపోతున్నట్లయింది.

అవును...అంతే చెయ్యాలి.

మొమ్మాటికీ అదే మంచిపద్ధతి.

అబ్బ...ఎంతమంచి మార్గందొరికింది?

చప్పున చిత్రంతోసహా గదిబైటికి పరిగెత్తాడు. లైటు ఆర్పలేదు. కనీసం ఆర్పమని చంద్రయ్యకు చెప్పనూ లేదు. గబగబ మెట్లెక్కేస్తున్నాడు.

"లైటు తీసెయ్యనా బాబూ?" అన్నాడు చంద్రయ్య. వెనుకనుంచీ ఏదో సమాధానం చెప్పాడు. ఏంచెప్పానా అని రెండు మెట్లెక్కి ఆలోచించాడు. అతనికే గుర్తురాలేదు. అక్కడే నిలబడి కిందికి చూశాడు. విజిటర్స్ రూం తలుపులు మూస్తున్నాడు చంద్రయ్య. ప్రసాదరావు పైకివెళ్ళాడు. క్షణాలమీద డ్రెస్ చేసుకుని మళ్ళీ క్రిందికి వచ్చాడు. ఆ 'బహుమతి' యింకా అతని చేతుల్లోనే వుంది. చంద్రయ్య చాప దులుపుకుంటున్నాడు — హాల్లో ఓమూల - తన పర్మనెంటు జాగాలో. అంతలో బైట కారుహారన్ మోగింది.

"చంద్రయ్యా! పనిమీద వెడుతున్నా. ఓ అర్ధగంటలో తిరిగొస్తా. మెలుకొని వుండు. అంటూనే ప్రసాదరావు బైటికి పరిగెత్తాడు.

డ్రైవర్ గేటుముందు కారాపి, కిందికి దిగి, గేటు పూర్తిగా తెరుస్తున్నాడు. అంతలోనే ప్రసాదరావు అక్కడికి చేరాడు.

"డ్రైవర్...! గేటు మూసేసి లోపలికి వెళ్ళి విశ్రాంతి తీసుకో! నేనూ పనిమీద వెడుతున్నాను. ఓ అర్ధగంటలో వచ్చేస్తాను. "అంటూ కార్లో కూర్చుని స్టార్ట్ చేసి, కొద్దిగా బ్యాక్ చేసి నులుపుత్రిప్పి ముందుకి సాగారాడు. కారు, చలినీ, గాలినీ చీల్చుకుంటూ దూసుకుపోయింది......

ఎదురుగా సైన్ బోర్డు.

"P. V. సుందరమ్ B. A. L. L. B. అడ్వొకేట్"

వరండాను ఆనుకుని వున్న గదిలో యింకా లైటు వెలుగుతూనే వుంది. లాయర్ సుందరం కాళ్ళు రెండూ టేబిల్ మీదికి బారజాపి కుర్చీలో వెనక్కివాలి ఏదో పుస్తకాన్ని చదవడంలో పూర్తిగా నిమగ్నమైవున్నాడు. ప్రసాదరావు గదిలో ప్రవేశించి టేబిల్ మీద రెండు మూడుసార్లు గట్టిగా తట్టి శబ్దం కలిగించే వరకూ సుందరం సమాధినుంచీ లేవలేదు. లేచాక డాక్టర్ వంక గ్రుడ్లు మిటకరించి చూస్తూ వుండి పోయాడు.

'ఏమిట్రా, అలా చూస్తావ్? నేనేం దయ్యాన్నా? భూతాన్నా!' అన్నాడు ప్రసాదరావు ఓ కుర్చీలో కూర్చుంటూ.

టేబిల్ మీదున్న కాళ్ళను తీసేసి. 'సివిల్ కోడ్' మూసేసి పక్కన పెడుతూ, 'అర్ధరాత్రివేళ ఊడిపడితే అలాగే అనుకోవలసి వస్తోంది.' అన్నాడు సుందరం.

నవ్వాడు, ప్రసాదరావు.

'నీకోసమే వచ్చాను.' అంటూ అతను గదిలో చుట్టూ చూశాడు.

ఓ మూల గోడకి ఫ్లాస్కు వేలాడు తున్నది.

'ఫ్లాస్కులో టీ వుందా?' అడిగాడు ప్రసాదరావు. ఓం, అంటూ సుందరం లేచి వెళ్ళి దానికున్న రెండు మూతల్లోనూ టీ పోసి, డాక్టర్‌కి వొకటిచ్చి, తనొకటి తీసుకున్నాడు.

'మీ ఆవిడ యింకా రాలేదా ?' అనడిగాడు, సుందరం.

'రాలేదుగనకే అర్ధరాత్రి వేళ వచ్చాననుకోరాదూ!' అన్నాడు ప్రసాదరావు టీ చప్పరిస్తూ.

'ఏం కథ ? అడిగాడు సుందరం.

ప్రసాదరావు వెంటనే జవాబివ్వలేదు. టీ పూర్తిగా తాగేశాడు, తరవాత యిద్దరూ సిగరెట్లు ముట్టించారు.

'చాలా పెద్ద చిక్కులో పడ్డాన్రా సుందరం!' అన్నాడు ప్రసాదరావు.

సుందరం తాపీగా సిగరెట్టు పొగ వొదుల్తూ, 'ప్రతిస్వల్ప విషయమూ—నీ దృష్టికి పరిష్కరింపరాని చిక్కు సమస్యగా కనిపించడం నాకు కొత్త కాదులేరా ? తొందరగా ఏడుపు ఆదేదో!' అన్నాడు.

రఘు తనకి బహూకరించిన చిత్రాన్ని గురించి చెప్పి, దాని కళా విశిష్టతను తెగ పొగిడాడు, ప్రసాదరావు, గుక్క తిప్పుకోకుండా!

'అంత గొప్ప చిత్రమా అది?' అంటూ సుందరం టేబిల్ మీద ఓ ప్రక్కగా వున్న చిత్రాన్ని అందుకోబోయాడు.

ప్రసాదరావు అడ్డుపడి, 'క్షణం ఆగి; నే చెప్పేది విను.' అంటూ తన భార్య వస్తున్న సంగతి చెప్పి. 'చూడు బ్రదర్! నా భార్య స్వభావం నీ కిదివరకే వివరించాను. ఈ చిత్రాన్నీ, నన్నూ ఈ అర్ధరాత్రి వేళ చూసిందంటే నా గతి అధోగతే! నువ్వే రక్షించాలి.' అన్నాడు, దాదాపు ప్రాధేయపడుతూ!

'అంటే—? ఏంచెయ్యమంటావింతకీ!' అన్నాడు సుందరం అర్ధంగాక.

'ఒకప్పుడు - నా పరువూ - ప్రతిష్టా భగ్నమై పోవటానికి సిద్ధంగావున్న సమయంలో ఆదుకున్నావ్ - నువ్వు. అందుకు నీకు సరైన విధంగా కృతజ్ఞతలు చెప్పుకోలేకపోయాను. యిప్పుడీ సమయంలో నీకీ చిత్రాన్ని సమర్పించుకుంటాను. నీకు అభ్యంతరం లేకపోతే దీన్ని స్వీకరించు.' అన్నాడు ప్రసాదరావు, చిత్రం మీద కాగితాన్ని విప్పుతూ.

'బాగుందిరా బ్రదర్! వ్యాపార సరళిలో మాట్లాడుతున్నావ్! అయితే యిందులో కృతజ్ఞతా భావమే తప్ప నీ స్వార్ధం లేదంటావ్?' అన్నాడు, సుందరం.

'ధన, ప్రాణ, మాన రక్షణల విషయంలో అబద్ధమాడవద్దన్నారు పెద్దలు. అన్నారు గదాని నీదగ్గర అబద్ధమాడలేను. ఉంది; స్వార్ధం వుంది.' అంటూ ప్రసాదరావు చిత్రాన్ని మిత్రుడికందించాడు.

ఉలిక్కి పడ్డాడు సుందరం. దాని వైపు చాలాసేపు రెప్ప వాల్చకుండా చూస్తూ వుండిపోయాడు. ఆఖరికి తేరుకొని, 'అత్యుత్తమ కళాఖండం.' అన్నాడు.

'నీకున్న కళాభిమానానికి పరిధి లేదని నాకు తెలుసురా! అందుకే దీన్ని నీకు ప్రత్యేకంగా యివ్వాలని తెచ్చాను. యితరులను బాధ పెట్టి - తను సుఖపడాలనుకోవటం స్వార్ధం కాని, నా స్వార్ధం యితరులను ఏవిధంగానూ, బాధించదు.' అని సంతృప్తిగా నిట్టూర్చాడు, ప్రసాదరావు.

సుందరం ఏమీ సమాధానం చెప్పలేదు. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా దొర్లాయి.

'క్షమించరా బ్రదర్! దీన్ని నేను స్వీకరించలేను.' అన్నాడు సుందరం - చిత్రం వంక ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూస్తూనే!

నిర్ఘాంత పోయాడు ప్రసాదరావు.

'ఎందుకని? ' అన్నాడు.

'కాశీ రామేశ్వరం యాత్రలు పూర్తిచేసుకొని మా అమ్మ తిరిగొస్తోంది. దేవుడి పటాలు మాత్రమే చూసి భక్తితో నమస్కరించె అమ్మ యిలాంటి చిత్రాలు చూడలేదు. చూసినా భరించలేదు. ఆవిడ యిష్టానికి

వ్యతిరేకంగా ప్రవర్తించటం నా వల్లకాదు.' అన్నాడు, సుందరం నిష్కర్షంగా.

'నగ్న చిత్రమే కావచ్చు. అంత మాత్రాన దీనిలోని అత్యుత్తమ కళానైపుణ్యాన్ని - మీ అమ్మగారి కోసం తృణీకరిస్తావా? ' అన్నాడు ప్రసాదరావు - తీక్షణంగా.

సుందరం వ్యంగ్యంగా నవ్వాడు.

'అదే ప్రశ్న నేను నిన్నడిగితే? ' అన్నాడు.

ప్రసాదరావు మాట్లాడలేదు. అలా అనటం తనది పొరపాటు అనుకున్నాడు. తన భావాన్ని మరో విధంగా వ్యక్తపరచలేక పోయినందుకు బాధ పడ్డాడు.

అంతలో సుందరంలేచి, 'ఇప్పుడే వస్తా నుండరా!' అంటూ లోపలికి వెళ్ళాడు.

అతను లోపల్నుంచీ తిరిగి వచ్చేసరికే ప్రసాదరావు వెళ్ళిపోయాడు. ఆ నగ్న చిత్రం మాత్రం అక్కడే వుంది. దాని మీద ఓ చిన్న చీటీ! తీసిచూశాడు, సుందరం.

'క్షమించు సుందరం. వెళ్ళొస్తాను. దీన్ని నీ చిత్తం వచ్చినట్లు చేసుకో! నా కేమీ అభ్యంతరం లేదు. కాని-యిప్పటి పరిస్థితిలో ఇది నా దగ్గర వుండటానికి వీల్లేదు.' అని ఆ చీటీలో వ్రాయబడివుంది.

చప్పున వరండాలోకి పరిగెత్తాడు సుందరం అప్పుడే కారు కదలి పోయింది.

వెధవ! చిన్నతనం నుంచీ యింతే! యితరులను వుచ్చులో బిగించి తను తప్పించుకుంటూ వుంటాడు... సుందరం పళ్ళు బిగించాడు. గదిలోకి నడిచాడు చేసేది లేక.

ఒర్చిలో కూర్చున్నాడు. దీన్ని ఎంత త్వరలో వదుల్చుకుంటే అంత మంచిది. శ్రేయస్కరం కూడా. అయితే మార్గం? ఎలా వదుల్చుకోవటం?

సుందరం ఆలోచిస్తున్నాడు.

ఎలా?... ఎలా? ... ఎలా? ... ఎలా?...

ఈ చిన్నప్రశ్న ఎన్నిసార్లు మెదడులో చక్రంలా గిర - గిర పరిభ్రమించిందో అతను లెక్క పెట్టుకోలేక పోయాడు.

ప్రసాదరావు కారులో వెడుతున్నాడు. అతని మనస్సుకి చాలా రిలీఫ్‌గా వుంది. చేతులో వున్న సిగరెట్ చాలా కమ్మగా వుంది. కప్పుకునేందుకు గుడ్డలేని - నిర్భాగ్యుని ఎముకలు కొరికే చలి; అతనికి ఓ విసవి సాయంత్రపు మందానిలంలా హాయిగా వుంది....

* * *

కవరు అందుకుని విప్పాడు, ప్రసాదరావు.

'డియర్ డాక్టర్;'

నమస్తే, నేను రఘును, గుర్తొచ్చానా? అర్ధరాత్రి భార్య ప్రాణరక్షణకోసం మిమ్మల్ని ప్రార్థించటం... దారిలో యాక్సిడెంటు నుంచీ తప్పించుకోవటం... అలాంటి అర్ధరాత్రివేళ నే మీకు నేను గీసిన చిత్రాన్ని బహూకరించటం...యివన్నీ మీకు గుర్తున్నాయి కదూ! మీరు కళాభిమానులు. అంత తేలిగ్గా మర్చిపోలేరని నాకు తెలుసు. మీకీ ఉత్తరం రాయటానికి నన్నొక విచిత్ర సంఘటన ప్రోత్సహించింది. ఆఫీసు నుంచీ వస్తున్నాను. రోడ్డు పక్కన ఫుట్‌పాత్ మీద కాలెండర్లు అమ్ముతున్నాడొక నిరుపేదవర్తకుడు. యాంత్రికంగా ఎందుకో అటు చూశాను. నా కాళ్ళు అలాగే నిల్చిపోయినై. ఆ కాలెండర్ల మధ్య ఫ్రేమ్ కట్టిన నా చిత్రం ఒకటి కనిపించింది. వెంటనే ఆ వర్తకుడ్ని, 'ఎంత?' అని ప్రశ్నించాను.

'పదిరూపాయలు' అన్నాడతను. ఆ డబ్బు చెల్లించి చిత్రాన్ని యింటికి పట్టుకుపోయాను. నా భార్య దానిని చూసి నిర్ఘాంత పోయింది.

'దీన్ని డాక్టర్ గారికి ప్రెజెంట్ చేశారు గదూ!' అన్నది.

'అవును, చేశాను, కాని యిప్పుడు పదిరూపాయలకు-కాలెండర్లు అమ్మేవాడి వద్ద కొన్నాను.' అన్నాను. నా భార్య కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఓరడించాను. సంఘటన చిన్నదే! కాని దాని వెనుక, కొన్ని హృదయాలు నగ్నంగా గోచరించాయి. నవ్వుకున్నాను. ఎంత పిచ్చినీ హృదయాలు? ఇదే చిత్రం ఏ ఎగ్జిబిషన్‌లోనైనా ఉంచితే కీర్తి ప్రతిష్ఠలు వచ్చేవి. కళకు నిజమైన విలువ కట్టగలిగిన - ఏ లక్షాధికారుల కళ్ళనోపడి వుంటే వందల విలువ చేసేది. అయితే నేను దానికిచ్చిన విలువ కృతజ్ఞత. అకృతజ్ఞతకు లభించిన విలువ తల్చుకుంటే గుండె దహించుకు పోతుంది. ఏమైతే నేం లెండి! కళాకారులు నేటి సమాజంలో దురదృష్టవంతులు. కాకుంటే వారి రక్తాన్ని జీర్ణించుకున్న కళ బజారు పాలవుతుందా? పై

సంఘటన వింతగా లేదా డాక్టర్ ? కులాసా అని తలుస్తాను. మీరు నాకు చేసిన మేలు - ఒక కళాకారుడుగా, ఒక సామాన్యుడిగా కలకాలం జ్ఞాపకముంచుకుంటాను. పై రెండు తరగతుల జ్ఞాపకాలలో దేనికి అత్యధిక ప్రాధాన్యత నివ్వాలో, విజ్ఞులు కళాభిమానులైన తమ బోట్లు వారికే విదితం కలవు...రఘు.'

పై ఉత్తరం చదవటం ముగించి సిగ్గుతో తల వంచేసుకున్నాడు ప్రసాదరావు. కొన్ని క్షణాలపాటు ఏదో ఆలోచించుకుంటూ వుండిపోయాడు. జ్ఞాపకం వచ్చినట్లు చప్పున టెలిఫోన్ రిసీవర్ అందుకున్నాడు. ఆపరేటర్ కి ఏదో నెంబర్ చెప్పాడు.

'హాలో! డాక్టర్ ప్రసాదరావు స్పీకింగ్.' అన్నాడు.

'వెధవా! ఆ అర్ధరాత్రి తరవాత మళ్ళీ అంతులేదేం? నేనే వద్దామనుకున్నా...కోర్టుపనులతో తీరక రాలేకపోయాను. అయినా సిగ్గూ ఎగ్గూ లేక ఏ మొహంతో ఫోన్ చేశావురా ?' అన్నాడు అటు ప్రక్క నుంచీ లాయర్ సుందరం - కసురుకుంటూ.

'సరేలే! ఈ మందలింపులూ అవీ సాయంత్రం తీరిగ్గా పూర్తిచేసుకుందాం! యింతకీ ఆ చిత్రాన్నేంచేశావ్?' అనడిగాడు ప్రసాదరావు.

'ఫ్రేమ్ కట్టి పూజించుకుంటున్నానని అనుకున్నావా ఏం? నా అదృష్టం బావుండి మా అమ్మ తన రాకను వారం రోజులు పోస్ట్‌పోన్ చేసుకుంది. ఆలోగా మద్రాసునుంచీ మా కజిన్ బ్రదర్ వచ్చాడు. ఆ చిత్రాన్ని చూసి, కావాలని పట్టుకుపోయాడు. అది యింట్లోంచీ బైటికి పోయాక పెద్ద భారం వదిలినట్లయిందిరా!' అన్నాడు సుందరం.

'అది అతనిదగ్గరైనా ఉంటుందంటావా?'

'ఓరేయ్...పిచ్చి సన్నాసీ! నీపిచ్చిగాని, అలాంటి చిత్రాలు ఇంట్లో వుంచుకుంటే ముసలాళ్ళు ఊరుకుంటారట్రా! వాడూ నాలాగే పెళ్ళి కావలసినవాడు. అదీకాక వాళ్ళ నాన్నొక ఛండో శాసనుడు. ఒళ్ళుమండి వాడు లేకుండా చూసి, ఓ కాలెండర్లమ్మేవాడికి-అయిన కాడికి తెగనమ్మి పారేశాట్ట. భోరున ఏడుస్తూ నాల్గు రోజులవాడు-మావాడో లెటర్ టా రాశాడు.'

ఎంతపని జరిగిందిరా! అన్నాడు ప్రసాదరావు బాధగా.

'ఏమిట్రా! ఏమైంది?' అన్నాడు, సుందరం.

ప్రసాదరావు జవాబివ్వకుండా రిసీవర్ దించేసి, రెండు చేతుల్తో తలపట్టుకూర్చున్నాడు. అతని మనసులో రకరకాల భావాలు ... దొంతర్లుగా పేరుకుపోతున్న భావాలు...ఒక్కసారిగా అతనికి సమాజం మీద కోపం ఉప్పెనలా పొంగింది.

ఈ సమాజంలో కళావినాశకులైన చీడపురుగుల్ని కత్తితో కండగా కోసి, కాకులకూ గ్రద్దలకూ వెయ్యాలి-అనుకోబోయి వెంటనే ఆ ప్రయత్నంనుంచీ విరమించుకున్నాడు.

ఎవరా కళావినాశకులైన చీడపురుగులు?

ఎవరని నిర్ణయించి, కాకులకూ గ్రద్దలకూ వెయ్యగలవు?

అంతరాత్మ అడిగిన పై ప్రశ్నలకు సరైన జవాబు చెప్పలేక డాక్టర్ ప్రసాదరావు, బాధగా, భారంగా, నిస్సహాయంగా ఓ సుదీర్ఘ నిశ్వాసం విడిచాడు.

కాలరంధ కదలిపోతూనే వుంది.

కళాభిమానులైన డాక్టర్ ప్రసాదరావు, లాయర్ పి. వి. సుందరం...ఇంకా-సమాజంలో పేరుప్రతిష్ఠలుగల అనేకమంది వ్యక్తులూ సాహిత్య సభలకూ, కళా ప్రదర్శనాలకూ, కళాకారుల సన్మానాలకు సంబంధించిన విషయాల్లో ముఖ్య పాత్రలు నిర్వహిస్తూనే వున్నారు.

రమాదేవి;-సుందరం తల్లి; ఛండ శాసనుడైన సుందరం కజిన్; మొదలైనవారంతా మారని భావాలతో పురోగమిస్తూనే వున్నారు—ఎదురులేకుండా.

సుందరం కజిన్ బ్రదర్ తండ్రి అమ్మిపారేసిన నగ్న చిత్రంకోసం యింకా పలురకాలుగా, పలుతావుల్లో అన్వేషిస్తూనే వున్నాడు.

తన భావోద్రేకానికి అనుగుణంగా, భావనంలో తల్లీనమై యింకా కళాఖండాలు రూపొందిస్తూనే వున్నాడు-కళాకారుడు-రఘు.

యిలా ఎవరికివారే ... ఎవరిపనులువారే - నటనో, నిజమో మరి...నిర్వర్తించుకుంటూనే వున్నారు.

మానవుడి ఈ అవిరామ జీవనస్రవంతికి ధ్యేయం ఏమిటో ?

(ఆధారం: అన్టన్ ఛెకోవ్.)